


https://www.sreechakranews.com

# శ్రీచక్ర



సంపుటి 7 | సంచిక 292 | కర్నూలు | సోమవారం, 04 మార్చి 2024

SREECHAKRA TELUGU DAILY

పేజీలు 08 | వెల రూ. 5.00

Published from Kurnool | Vijayawada | Ananthapuramu | Kadapa | Chittoor | Nellore | Prakasham | East Godavari | West Godavari | Hyderabad


# మార్చి 6న ఢిల్లీలో.. నిరసన ప్రదర్శనలు

- మార్చి 10న దేశవ్యాప్తంగా రైల్ రోకో : రైతు నేతల పిలుపు

**ఢిల్లీ, మార్చి 3 (శ్రీచక్ర) :**



తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా మార్చి 6న ఢిల్లీలో నిరసన ప్రదర్శనల్లో పాల్గొనాలని, మార్చి 10న దేశవ్యాప్తంగా రైల్ రోకో చేపట్టాలని పిలుపునిచ్చాయి. ఈ మేరకు రైతు సంఘాల నేతలు సర్వన్ సింగ్ పంధేర్, జగ్జీత్ సింగ్ డాల్లేవాల్ ఇటీవల ఘర్షణలో మృతిచెందిన రైతు స్వగ్రామం బల్లోహ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న నిరసన కేంద్రాల వద్ద రైతుల ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని.. కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించేవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని నేతలిద్దరూ స్పష్టం చేశారు. ప్రస్తుతం శంభు, ఖానౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద జరుగుతున్న ఆందోళనకు పంజాబ్, హరియాణా రైతులు మద్దతు కొనసాగిస్తుండగా.. మార్చి 6న ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులు, రైతు కూలీలు రాజధాని ఢిల్లీకి చేరుకొని నిరసనలో పాల్గొనాలని రైతు సంఘాలు నిర్ణయించాయని కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) నేత సర్వన్‌సింగ్ పంధేర్ అన్నారు. ట్రాక్టర్ ట్రాలీల్లో చేరుకోలేని దూర రాష్ట్రాల రైతులు రైళ్లు, ఇతర రవాణా మార్గాల ద్వారా ఢిల్లీకి రావాలని విజ్ఞప్తి చేశారు. శంభు, ఖానౌరి వద్ద ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని తెలిపారు. ఈ ఆందోళనను దేశవ్యాప్తంగా విస్తరించేందుకు రెండు ఫోరమ్‌లు మార్చి 10వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దేశంలో రైల్‌రోకో చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చినట్లు పంధేర్ తెలిపారు. రైతుల డిమాండ్లకు మద్దతుగా అన్ని పంజాబ్ పంచాయతీలు తీర్మానం చేయాలని, ప్రతి గ్రామం నుంచి ఒక ట్రాక్టర్ ట్రాలీ సరిహద్దు పాయింట్ల వద్దకు చేరుకుంటుందని తెలిపారు. ఢిల్లీ చలో మార్చ్‌ను అడ్డుకొనేందుకు కేంద్రం అన్ని వ్యూహాలు పన్నిందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలు పంజాబ్‌కే పరిమితమని, కేవలం రెండు ఫోరమ్‌లు మాత్రమే ఈ పోరాటాన్ని నడిపిస్తున్నాయన్న అభిప్రాయాన్ని కల్పించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని పంధేర్ అన్నారు. కానీ దేశంలోని 200 కంటే ఎక్కువ రైతు సంఘాలు ఈ రెండు ఫోరమ్‌లలో భాగమేనని స్పష్టం చేస్తున్నామన్నారు. రైతుల సమస్యల్ని పరిష్కరించడం కేంద్రానికి ఇష్టం లేదని ఆరోపించిన ఆయన.. ఎన్నికల్లో గెలిచేందుకు భాజపా విభజన రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. భాజపా సర్కార్ అజెండాలో రైతులు, రైతు కూలీలు లేరన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తే ఆందోళనలు తగ్గుముఖం పడతాయన్న అభిప్రాయం సరైంది కాదని.. తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీవో) పరిధి నుంచి తీసేయాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఆఖరి శ్వాస వరకు పోరాడతామని జగ్జీత్ సింగ్ డాల్లేవాల్ అన్నారు. ఈ ఆందోళనలు కేవలం పంజాబ్‌కు మాత్రమే పరిమితమని వాదించేవారు.. హరియాణా సరిహద్దుల్లో కర్ఫ్యూ లాంటి పరిస్థితిని ఎందుకు విధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగానే తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. మళ్లీ తాజాగా తమను చర్చలకు కేంద్రం పిలవలేదని.. పిలిచిన ప్రతిసారీ కాదనకుండా వెళ్లిన విషయాన్ని ఈ సందర్భంగా వెల్లడించారు. రైతు శుభకరన్ సింగ్ త్యాగం వృథా కాదని పేర్కొన్నారు.

# ఎన్నికల సమయంలో.. ప్రజల ఆదరణ చూరగొనేందుకు అన్ని విధాలా కృషి చేయాలి : మోదీ



**ఢిల్లీ, మార్చి 3 (శ్రీచక్ర) :**

లోక్‌సభ ఎన్నికల సమయంలో.. ప్రజల ఆదరణ చూరగొనేందుకు అన్ని విధాలా కృషి చేయాలని తన మంత్రివర్గ సహచరులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర మంత్రిమండలి ఆదివారం ఢిల్లీలో సమావేశమైంది. ఈ సందర్భంగా "వికసిత్ భారత్- 2047 " విజన్ డాక్యుమెంట్‌తోపాటు రాబోయే ఐదేళ్ల కోసం వివరణాత్మక కార్యాచరణ ప్రణాళికపై మేధోమథనం జరిపినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తీసుకోవాల్సిన తక్షణ చర్యల కోసం 100 రోజుల అజెండాపైనా చర్చించినట్లు తెలిపాయి. "వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్ రూపకల్పనకు కేంద్రం రెండేళ్లకుపైగా తీవ్ర కసరత్తు చేసింది. అన్ని మంత్రిత్వశాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, పౌర సమాజం, శాస్త్రసాంకేతిక సంస్థలు, యువతతో విస్తృత సంప్రదింపులు జరిపింది. మొత్తం ప్రభుత్వం ఈ ప్రక్రియలో నిమగ్నమైంది" అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీని కోసం 2,700కు పైగా సమావేశాలు, కార్యశాలలు, సెమినార్‌లు నిర్వహించామని.. యువత నుంచి 20 లక్షలకుపైగా సూచనలు స్వీకరించామని ఓ అధికారి వెల్లడించారు.


**'వికసిత్ భారత్'లో ఏముంది..?**

'వికసిత్ భారత్-2047' రోడ్‌మ్యాప్‌లో జాతీయ విధానాలు, ఆకాంక్షలు, లక్ష్యాలు, ఈ దిశగా చేపట్టాల్సిన కార్యాచరణ గురించి సమగ్రంగా పొందుపర్చారు. ఆర్థిక వృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, మౌలిక సదుపాయాలు, సామాజిక సంక్షేమం, సులభతర వ్యాపారం, జీవనం వంటివాటిలో భారత్ తన లక్ష్యాలను నిర్దేశించుకుంది. సమావేశంలో వివిధ మంత్రిత్వ శాఖలూ తమ ఆలోచనలను పంచుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. త్వరలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో మోదీ సర్కారుకు ఇది తుది మంత్రిమండలి భేటీగా భావిస్తున్నారు.

# రాష్ట్రంలో మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు

**హైదరాబాద్, మార్చి 3 (శ్రీచక్ర) :**


రోజురోజుకు ఎండ తీవ్రమవుతున్న నేపథ్యంలో ఒంటిపూట బడులను నడపాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నెల 15 నుంచి రాష్ట్రంలోని బడులను ఒంటిపూట మాత్రమే నిర్వహిస్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని బడులు ఉదయం 8 గంటలకు ప్రారంభమై.. మధ్యాహ్నం 12 : 30 గంటల వరకు కొనసాగుతాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మధ్యాహ్నం 12 : 30 గంటల సమయంలో అందజేస్తారు. పదో తరగతి పరీక్షల సమయంలో పరీక్షాకేంద్రాలున్న బడుల్లో మాత్రం మధ్యాహ్నం పూట స్కూళ్లను నిర్వహిస్తారు. వీరికి తొలుత మధ్యాహ్నం భోజనం అందజేసి ఆ తర్వాత తరగతులు కొనసాగిస్తారు. పది పరీక్షలు ముగిసిన తర్వాత మళ్లీ ఉదయం పూటే ఆయా బడులు నడుస్తాయి.



# రష్యా ఊహకు అందనంతగా ప్రతిఘటన !

- ఉక్రెయిన్‌ను దారికి తెచ్చుకోవడంలో విఫలం
- రెండేళ్లుదాటినా ముగింపు దశకు చేరని యుద్ధం

**మాస్కో, మార్చి 3 (శ్రీచక్ర) :**



రెండేళ్లయినా రష్యా అడపాదడపా తన దాడులను ఇంకా కొనసాగిస్‌ఊతనే ఉంది. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముగింపు పలికి ప్రజలను స్వేచ్ఛగా బతికించడంలో రష్యా ముందుకు రావడం లేదు. అందుకే ఉక్రెయిన్ కూడా గట్టిగానే జవాబిస్తూ వస్తోంది. ఉక్రెయిన్‌పై దాడి ఇంత భయంకరంగా ఉంటుందని బహుషా రష్యా కూడా ఊహించి ఉండదు. ఒకటి రెండురోజుల్లో సునాయాసంగా ఉక్రెయిన్‌ను ఆక్రమించుకోవచ్చన్న పుతిన్ అంచనాలు తలకిందుల య్యాయి. రెండేళ్లు దాటినా ఉక్రెయిన్‌ను దారికి తెచ్చుకోలేక పోయింది. రష్యా దాడులకు ధీటుగా ఏడాదిగా ఉక్రెయిన్ ఎదురుదాడి చేస్తూనే ఉంది. తన దేశ అస్థిత్వాన్ని కాపాడుకుంటూనే రష్యాను గట్టిగా ఢీకొంటోంది. మరోవైపు అమెరికా తదితరదేశాలు కూడా మద్దతును పెంచుతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధంతో నష్టపోతున్న దేశాలు కూడా మెల్లగా గొంతువిప్పి రష్యా తీరును ఎండగడుతున్నాయి. రష్యాలో కూడా ఈ యుద్ధం పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోంది. మరోవైపు రష్యా సైనికులు వేలల్లో మరణిస్తున్నారు. ఈ క్రమంలో మెల్లగా ప్రపంచ దేశాలన్నీ ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్నాయి. అలాగే సైనిక సాయం అందించేందుకు ముందుకు వస్తున్నాయి. పరిస్థితులు చేజారుతాయన్న భయంతో ఆయా దేశాలు కొంత వెనకడుగు వేస్తున్నాయి. లేకపోతే ఈ పాటికి ఉక్రెయిన్‌కు మద్దతుగా అనేక దేశాలు యుద్ధరంగంలోకి దిగేవే. అలాగే ఆర్థిక ఆంక్షల కారణంగా రష్యా ఆర్థిక వ్యవస్థ కూడా కుదేలవుతోంది. అణుబాంబు బూచి చూపుతున్న పుతిన్ ..ప్రపంచంలో తన ప్రతిభను పూర్తిగా కోల్పోయారు. ఆయా దేశాలు ఇప్పుడు పుతిన్‌ను చూసి ఏవగించుకుంటున్నాయి. పుతిన్ కూడా బహుశా యుద్ధం ఇంత దారుణంగా ఉంటుందని ఊహించి ఉండరు.ఒకటి రెండురోజుల్లో ఉక్రెయిన్ దారికి వస్తుందని కదనరంగంలోకి దిగి ఉంటారు. కాకపోతే అంత ఈజీ కాదని ఇప్పుడు తెలిసి ఉంటుంది. మరోవైపు తమ లక్ష్యం పూర్తయ్యేదాకా సైనిక ఆపరేషన్ కొనసాగుతుందని రష్యా ప్రకటించింది. అడపాదడపా దాడులతో భయపెడుతూనే ఉంది. అయితే పరిస్థితులు ఎలా ఉన్నా ఉక్రియిన్ మాత్రం బాగా దెబ్బతింది. దీన్ని పునర్నించుకోవడం ఇప్పట్లో సాధ్యం అయ్యే పనికాదు. తమను ఒంటరి చేయొద్దని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రపంచ దేశాలను ఇప్పటికే వేడుకున్నారు. ఉక్రెయిన్‌కు ఇయు సాయం కావాలని కోరారు. అణు యుద్ధం వచ్చే ప్రమాదముందని, దీనిని ఎదుర్కొనేందుకు అణు దళాలు అప్రమత్తంగా ఉండాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదేశించారు. మూడో ప్రపంచ యుద్ధం తప్పదని అంతా భావించారు. కానీ అది రాష్యాకు కూడా ప్రమాదమని రష్యాన్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇకపోతే పుతిన్ మరింత పట్టుదలగా ఉక్రెయిన్‌ను దెబ్బతీయాలని చూస్తున్నారు. పౌరులు చనిపోతున్నా పెద్దగా పట్టించుకోవడం లేదు. అందుకే ప్రధాన నగరాలను స్వాధీనం చేసుకునే క్రమంలో వరుస రాకెట్ దాడులు, పేలుళ్లతో ఉక్రెయిన్ రగులుతోంది. పశ్చిమ దేశాల నుంచి పొంచివున్న ప్రమాదాలను తిప్పికొట్టే క్రమంలో తనను తాను రక్షించుకునేందుకు అవసరమైన ప్రధాన లక్ష్యాన్ని చేరుకునే వరకూ ఉక్రెయిన్‌లో చేపట్టిన ప్రత్యేక సైనిక ఆపరేషన్ కొనసాగుతుందని రష్యా రక్షణ శాఖ మంత్రి తెలిపారు. పశ్చిమ దేశాల నుంచి పొంచివున్న సైనిక పరమైన ముప్పు నుంచి రక్షించు కోవడమే రష్యా ముందున్న ప్రధానలక్ష్యం. మా దేశంపై పోరాడేందుకు పశ్చిమ దేశాలు ఉక్రెయిన్ ప్రజానీకాన్ని పావుగా వాడుకోవాలని చూస్తున్నాయి. ఈ దుర్మార్గాన్ని సహించం. ఈ ముప్పును తిప్పికొట్టేదాకా ఆపరేషన్ కొనసాగుతుందని తెలిపారు. అయితే ఏడాదిగా ఇప్పటికే ఇరు దేశాలు ఎంతో నష్టపోయాయి. ఉక్రెయిన్‌లో తక్షణమే యుద్ధాన్ని నిలిపేయాల్సిన అవసరం ఉంది. ఇరుదేశాల నాయకులు శాంతిమార్గం పట్టాలి. పుతిన్‌ను ప్రపంచం ఏకాకి చేయాలని బైడెన్ పిలుపు ఇచ్చారు. అప్పటి వరకు ఉక్రెయిన్ బిక్కుబిక్కుమంటూనే పోరాడుతోంది. ఇది ఎంతకాలం అన్నది చూడాలి. రష్యా కూడా ఇది ఎంత తొందరగా యుద్ధాన్ని ముగిస్తే అంతమంచిదే.

# పల్స్ పోలియో విజయవంతం





● పెద్దకడబూరు మండలంలో 93 శాతం నమోదు

**పెద్దకడబూరు, మార్చి 3 (శ్రీచక్ర) :**

పెద్దకడబూరు మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయింది. మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న 6015 మంది 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు 34 పల్స్ పోలియో కేంద్రాలు, మూడు మొబైల్ టీమ్ ల ద్వారా పోలియో చుక్కలు వేశారు. పెద్దకడబూరులో ప్రాథమిక పాఠశాలలో (మెయిన్) ఎంపీపీ శ్రీవిద్య చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. దొడ్డిమేకలలో సర్పంచ్ చంద్రశేఖర్, హెచ్ మురవణిలో సర్పంచ్ జానకమ్మ, రాగిమాన్ దొడ్డిలో సర్పంచ్ చంద్రకళ, చిన్నకడబూరులో జెడ్పీటీసీ రాజేశ్వరి, పీకలబెట్టలో గ్రామ సర్పంచ్ మూలింటి లక్ష్మి, నౌలేకల్ లో సర్పంచ్ పల్లవి హులికన్విలో సర్పంచ్ చిన్న మహాదేవ, గవిగట్టులో సర్పంచ్ నాగరాజు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కోరారు. చిన్నారులకు అవిటితనం రాకుండా ఉండేందుకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. వైద్యాధికారి తాహేర్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో 93 శాతం నమోదైందని, మిగిలిన చిన్నారులకు తమ ఏఎన్ఎం సిబ్బంది, ఆశావర్కర్లు సోమ, మంగళవారాలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేసి 100 శాతం పూర్తి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కృష్ణమోహన్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## లింగ వివక్ష లేని సమాజ నిర్మాణంలో అందరు భాగస్వామ్యం కావాలి

● సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ



**కర్నూలు, మార్చి 3 (శ్రీచక్ర) :**

సమాజంలో అవకాశాలు కల్పిస్తే మహిళలు పురుషులకు ఏ మాత్రం తగ్గకుండా రాణిస్తారని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. నగరంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మండపంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళ తైక్వాండో క్రీడాకారులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు అనే వివక్ష లేకుండా ప్రతి ఒక్కరు అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో అధ్యక్ష పదవి ఇంతవరకు మహిళలకు దక్కలేదని, ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం లాంటి దేశాల్లో మహిళలకు అలాంటి అవకాశాలు దక్కిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సమాజంలో స్త్రీల పట్ల వివక్ష ధోరణి ఉండడం దురదృష్టకరమన్నారు. పురుషులతో సమానంగా రాణించే అవకాశం ఉన్నప్పటికీ మహిళలకు ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లభించడం లేదన్నారు. మహిళలు అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని ఆకాశమే హద్దుగా ఎదగాలన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తైక్వాండో లో మహిళా క్రీడాకారులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ఏ కుటుంబంలో అయితే మహిళ ఉన్నత స్థానంతో ఉంటుందో ఆ కుటుంబం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

## వైసీపీ యువనేత ధరణీ రెడ్డిని కలిసిన నౌలేకల్ నేతలు



**పెద్దకడబూరు, మార్చి 3 (శ్రీచక్ర) :**

ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తనయుడు, వైసీపీ యువనేత ధరణీ రెడ్డిని పెద్దకడబూరు మండలంలోని నౌలేకల్ గ్రామ వైసీపీ నేతలు గ్రామ సర్పంచ్ పల్లవి నరేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం మంత్రాలయం మండలం రాంపురంలో ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నరేష్ కుమార్ గౌడ్ తోపాటు గ్రామ వైసీపీ నాయకులు అంజినయ్య, హనుమంతు, నరసయ్య, రామాంజనేయులు కలిసిన వారిలో ఉన్నారు. నౌలేకల్ గ్రామంలో పరిస్థితులపై ధరణీ రెడ్డితో చర్చించారు.

## తాగునీటి ఎద్దడి తీర్చేందుకు బోర్లు



**పెద్దకడబూరు, మార్చి 3 (శ్రీచక్ర) :**

పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంళం గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ యువనేత ప్రదీప్ రెడ్డి, వైసీపీ నాయకులు పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి సహకారంతో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఆదివారం రెండు బోర్లు వేయించారు. గ్రామ వైసీపీ నాయకులు లక్ష్మన్న, తెలుగు చిన్న వీరేష్, తెలుగు పెద్ద వీరేష్, బోయ కడబూరి, మహదేవ ప్రత్యేక పూజలు చేసి బోర్ వేయడానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో బీసీ కాలనీలో, సచివాలయం - 1 సమీపంలో రెండు చోట్ల బోర్ వేయించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆయా కాలనీవాసులకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలలో భాగంగా బోర్లు వేయించినట్లు తెలిపారు.

## పిల్లల ఆరోగ్యానికి పోలియో చుక్కలు తప్పనిసరి

● జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన



**కర్నూలు, మార్చి 3 (శ్రీచక్ర):**

జిల్లాలో జీరో నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు తమ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు నగరం ఏ క్యాంప్ లోని ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో 0-5 సంవత్సరాలలోపు చిన్నారులకు జిల్లా కలెక్టర్ పల్స్పోలియో చుక్కల వేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేసి చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దామని కలెక్టర్ పేర్కొన్నారు. . 5 సం.లోపు చిన్నారులకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని అది మనందరి బాధ్యత అని అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో నూరుశాతం లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జిల్లాలో 3,48,071 మంది 5 సంవత్సరాల లోపు పిల్లలకు 1600 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని , అదే విధంగా ప్రయాణంలో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయుట కొరకు బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లలలో 52 కేంద్రాలు ఏర్పాటు చేసామని తెలియచేసారు. ఇటుక బట్టీలు, భవన నిర్మాణ ప్రాంతాలు, సంచార జాతుల గుడారాలు వంటి హై రిస్క్ ప్రాంతాలలో ఉన్న 5సం లోపు పిల్లలకు పోలిచుక్కలు వేయుటకు 63 మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయుదురని తెలిపారు. ఏదేనీ కారణం చేత పోలియో చుక్కలు వేయించుకొని పిల్లలకు ఈనెల 4, 5 మరియు 6 వ తేదీలలో ఇంటింటికీ వైద్య బృందాలు తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో స్టేట్ నోడల్ ఆఫీసర్ రవీంద్రా రెడ్డి,డిఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య,డీఐఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డీ ఈ ఓ శామ్యూల్ ,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలనాగిరెడ్డి నాల్గోసారి ఎమ్మెల్యేగా గెలవాలని పాదయాత్ర



**పెద్దకడబూరు, మార్చి 3 (శ్రీచక్ర) :**

మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి రాబోయే ఎన్నికల్లో నాల్గోసారి ఎమ్మెల్యేగా గెలవాలని కోరుతూ వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురామ్, 10వ వార్డు సభ్యులు బ్రహ్మయ్య ఆచారి ఆదివారం పెద్దకడబూరు నుండి శ్రీశైలానికి పాదయాత్రతో బయలుదేరారు. ఈ సందర్భంగా వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురామ్ మాట్లాడుతూ మంత్రాలయం నుండి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన బాలనాగిరెడ్డి రాబోయే ఎన్నికల్లో కూడా విజయం సాధించాలని శ్రీశైల మల్లికార్జునస్వామికి పాదయాత్రతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఏపీ ముఖ్యమంత్రిగా పేదల సంక్షేమ ప్రధాత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలని భగవంతునికి పూజలు చేస్తామని తెలిపారు.

## తెలుగుదేశం విజయం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలి

● టిడిపిలో చేరిన బంగారుపేట వైసీపీ నేతలు ● టిడిపి అభ్యర్థి టి.జి భరత్




**కర్నూలు, మార్చి 3(శ్రీచక్ర):**

రానున్న 40 రోజులు నాయకులు, కార్యకర్తలు కష్టపడి తనని గెలిపిస్తే ఐదేళ్ల పాటు ప్రజలకు మంచి భవిష్యత్తు అందిస్తానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టి.జి భరత్ అన్నారు. ఆదివారం మౌర్య ఇన్‌లో బంగారుపేటకు చెందిన వైసీపీ నాయకుడు ఏలియా తెలుగుదేశం పార్టీలో చేరారు. టి.జి భరత్.. ఏలియాతో పాటు బంగారుపేటకు చెందిన యువకులు, మహిళలకు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం టి.జి భరత్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. పార్టీలో చేరిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త విజయం కోసం కష్టపడాలని సూచించారు. వైసీపీ నాయకుల నాటకాలు నమ్మకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రజలకు ఎంత మాత్రం మేలు చేయని వైసీపీ నాయకులు మాటలను కోటలు దాటిస్తారన్నారు. తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే ప్రజల భవిష్యత్తు ఎంతో బాగుంటుందని చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే ప్రజా ప్రభుత్వం వచ్చినట్లే అన్నారు. ఇక కర్నూల్లో తనను గెలిపిస్తే ప్రజల కష్టాలు తీరుస్తానని హామీ ఇచ్చారు. ప్రత్యేక ప్రణాళికతో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో రవి, ప్రభాకర్, దేవదానం, మహేష్, పవన్, ప్రభావతి, ధనలక్ష్మి, నాగలక్ష్మి, ప్రభావతి, శివమ్మ, దానమ్మ, మంజుల, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు శ్రీనివాస రెడ్డి, సురేష్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

**ప్రొద్దుటూరు, మార్చి 3(శ్రీచక్ర) :**



స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీ వేదవ్యాస డిగ్రీ కాలేజి ఎన్.ఎస్.ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ఆదివారం మూడవ రోజు పెద్దశెట్టిపల్లె గ్రామంలో విద్యార్థిని, విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎల్. నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులు జలుబు, జ్వరం, దగ్గు, ఇన్ఫెక్షన్స్ వంటివి దరిచేరవని అన్నారు. అలాగే కళాశాల ప్రెసిడెంటు జి. సుదర్శన రెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి చెప్పారు. అలాగే ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. రామలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ వేసవిలో అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో డీహైడ్రేషన్ కు గురయ్యే ప్రమాదం ఉంటుందని,ఈ సమస్య ఎదురుకాకుండా ఉండాలంటే నీరు,నిమ్మరసం, కొబ్బరి నీరు, గ్లూకోజ్ వంటి వాటిని తీసుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్లు కె. నాగరాజ,ఎస్.పి. యాసిన్ మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మల్లె మొగ్గలు - పుస్తకావిష్కణ





**పెద్దకడబూరు, మార్చి 3 (శ్రీచక్ర) :**

పెద్దకడబూరు మండల పరిధిలోని కంబదహాళ్ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 'మల్లె మొగ్గలు' 48వ పుస్తకాన్ని విశ్రాంత అటవీశాఖ అధికారి ఏ.యల్.కృష్ణారెడ్డి, విశ్రాంత భూగర్భ గనుల శాఖ డైరెక్టర్ వి.డి. రాజగోపాల్, కళారత్న బిక్కిరత్న, ఆర్.వి. మల్లీశ్వరి చేతుల మీదుగా ఆదివారం హైదరాబాద్ లో ఆవిష్కరించారు. అనంతరం ఈ పుస్తకాన్ని వి.డి రాజగోపాల్ కు అంకితమిచ్చారు. కృతికర్త గద్వాల సోమన్నను బాలసాహిత్యంలో వారి విశేష కృషికిగాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాయకులు రవీంద్రబాబు, చంద్రశేఖర్ పిళ్ళై, ఏ.చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. పుస్తక రచయిత, బాలసాహిత్యరత్న గద్వాల సోమన్నను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థులు, శ్రేయోభిలాషులు మరియు విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

## పల్స్ పోలియో వేయండి పిల్లలకు అంగవైకల్యం రాకుండా కాపాడుకోండి

● ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి



**ప్రొద్దుటూరు, మార్చి 3 (శ్రీచక్ర) :**

చిన్న పిల్లలకు పల్స్ పోలియో తప్పనిసరిగా వేయించుకుని అంగవైకల్యం రాకుండా కాపాడుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమం లో భాగంగా స్థానిక శ్రీరాములపేట అర్బన్ హెల్త్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు పోలియో చుక్కలు వేయించుకోవటం వలన అంగవైకల్యం రాకుండా కాపాడుతుందని, భారతదేశం అంతా ఒకే రోజు ఒకేసారి పుట్టిన బిడ్డ మొదలుకొని 5 సంవత్సరాల పిల్లలకు వేస్తున్నారని, కావున తల్లిదండ్రులందరు తమ పిల్లలకు ఈ పోలియో చుక్కలు వేయించాలని, పోలియో వ్యాధి రాకుండా వుండాలంటే ఈ పోలియో చుక్కలు వేయించి పోలియో వ్యాధి రాకుండా నిర్మూలించాలని తెలిపారు. అలాగే శ్రీరాములపేట పూర్ణ బ్యాంకు కోచింగ్ సెంటర్ దగ్గర శాసన మండలి సభ్యులు రమేష్ యాదవ్, శ్రీరాములపేట ఆసుపత్రి నందు మున్సిపల్ చైర్మన్ లక్ష్మీదేవి, పాత బస్టాండ్ నందు జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, మున్సిపల్ ఆఫీస్ సెంటర్ నందు మున్సిపల్ కమీషనర్ రఘురామి రెడ్డి, పవర్ హౌస్ రోడ్ సెంటర్ నందు అర్బన్ వైద్యాధికారి డాక్టర్ ఇళయా రాణి, డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, ఉర్దూ స్కూల్ సెంటర్ నందు డాక్టర్ నజీర్ బాష, వార్డ్ ల నందు వార్డ్ కౌన్సిలర్స్ పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ వైద్యాధికారుల భరత్ నారాయణ, మౌనిక, దినేష్, హిమబిందు, ఆలీమ్, పూజిత, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, హెచ్ ఇ ఓ వెంకటరత్నం మరియు రూట్ సూపర్ వైజర్స్ పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరులో ఐఎంఏ రీజనల్ సమావేశం

**ప్రొద్దుటూరు, మార్చి 3 (శ్రీచక్ర) :**



సార్వజనీన వైద్యం ఐఎంఏ లక్ష్యమని ఐఎంఏ రాష్ట్ర సెక్రటరీ ఫణీధర్, ప్రవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏవి సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక త్యాగరాజ రెడ్డి కళ్యాణమండపంలో ఐఎంఏ సౌత్ జోన్ 3 రాష్ట్ర మెడికల్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ఐఎంఏ ఒక దేశ వ్యాప్త సంస్థ అని, 1764 శాఖలు దేశవ్యాప్తంగా వుండగా, 4 లక్షల మంది వైద్యులు సభ్యులుగా వున్నారన్నారు. ఈ కార్యవర్గంలో తమకు స్థానం కలగడం ఆనందకరమన్నారు. ప్రజలు వైద్యానికి అయ్యే ఖర్చులో 63 శాతం భరిస్తే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం 37 శాతం మాత్రమే ఇస్తారని, అనేక ప్రభుత్వ పథకాలు వున్నా ఈ శాతం అందడం బాధాకరమన్నారు. పన్ను ఆధారితంగా అయినా ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజలు ఆరోగ్య ఖర్చులతోనే పేదరికంలో కూరుకుపోతున్నారన్నారు. అన్ని రకాల వైద్యాలను కలిపే యోచనలో కేంద్ర వుందని, ఇది సరైన యోచన కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రొద్దుటూరు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జివిజి మహేష్, హరీష్, రాష్ట్ర వ్యాప్తంగా 425 మంది వైద్యులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులు ఏక పక్షంగా తిర్పునిస్తారు

● ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి





**ప్రొద్దుటూరు, మార్చి 3 (శ్రీచక్ర) :**

ముస్లిం సోదరులు ఏక పక్షంగా తిర్పునిస్తారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక జిన్నా రోడ్ 18 వార్డులో కౌన్సిలర్ మహ్మద్ గౌస్ అధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లును, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ని వార్డు కౌన్సిలర్ తో పాటు పలువురు స్థానిక వైసీపీ నాయకులు ఘనంగా ఆహ్వానించారు. అనంతరం వారు వార్డులో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యే గా రాచమల్లు ను, సీఎం గా జగన్ మోహన్ రెడ్డి ని తిరిగి గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులు వైసీపీ పట్ల విశ్వాసంతో వున్నారని, ప్రతి ఒక్కరూ ప్రచారంలో తమను ఆదరిస్తున్నారన్నారు. ఈ వార్డులో 97 % వరకు ముస్లిం సోదరులు ఉన్నారని, ముస్లింలప ఉన్న వార్డులలో ఓటు తమకే, విజయం తమదే అని స్పష్టం చేశారు. అనేక రకాల పథకాల పేర్లతో వార్డు ప్రజలందరికీ లబ్ది జరిగిందన్నారు. అదేవిధంగా 3550 జబ్బులకు ఆరోగ్య శ్రీ కార్డు ఇచ్చారని, 50,000 మందికి 200 కోట్లు రుణమాఫీ డబ్బులు కట్టాడని, పేదరికంలో ఉన్న వారికి అందరికీ జగన్ మంచి చేశారని వివరించారు. అభివృద్ధి జరగడం అంటే ఏమిటో టిడిపి నాయకులకు తెలుసా అని ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో వైసీపీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, 120 కోట్ల రూపాయలు తో ప్రొద్దుటూరు లో ప్రతి ఒక్క కాలువ రోడ్ అన్ని వేయగలిగామని స్పష్టం చేశారు. తాను ప్రతి ఒక్కరికీ సహాయపడ్డానన్నారు. ప్రొద్దుటూరు లో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉన్నారని తెలిపారు. వైసీపీ హయాంలో ప్రజలకు మేలు జరిగి ఉంటే మాకు ఓటు వేయాలని, లేని పక్షంలో టిడిపి నే ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, కౌన్సిలర్లు జిలానీ బాష, గరిశపాటి లక్ష్మిదేవి, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్సీపిఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, వైసీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, మహిళా అధ్యక్షురాలు కోనేటి సునంద, వైసీపీ నాయకులు పాతకోట బలరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాయకుదురు గ్రామంలో పల్స్ పోలియో కేంద్రానికి ప్రారంభించిన సర్పంచ్ భారతి భాస్కరరావు

**వీరవాసరం, మార్చి 2 (శ్రీచక్ర) :**



రాయకుదురు గ్రామ పంచాయితీ వద్ద సర్పంచ్ గెడ్డం భారతి భాస్కరరావు ఆదివారం పోలియో చుక్కలు వెయ్యడం ప్రారంభించారు. 5 సంవత్సరాలు లోపు ఉన్న చిన్న పిల్లల అందరికీ పోలియో చుక్కలను వేశారు.

## ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

● కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్


**కర్నూలు, మార్చి 3 (శ్రీచక్ర):**



ఆన్లైన్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలని, అలాగే ఖాళీ సమయాలలో పనిచేసి అదనపు ఆదాయం ఆర్జించమంటూ ఆన్లైన్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలకు ప్రజలు గురికాకుండా తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకొని కొందరు వ్యక్తులు పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని , కానీ ప్రాసెస్సింగ్, రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాలని నమ్మబలికి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తారని, కొందరు అయితే ఏకంగా ఫేక్ ఇంటర్వ్యూలు నిర్వహించి, ప్రాంగణ ఎంపికలు చేసేలా నటించి, సొమ్ము అందగానే పత్తా ఉండరని, అలాగే ఉద్యోగులు, అలాగే గృహిణిలు ఇంటి వద్దే ఉంటూ ఖాళీ సమయాలలో పనిచేస్తూ అదనపు ఆదాయం సంపాదించండి" వంటి ఆకట్టుకునే ప్రకటనలు చూసి ఆర్థిక కష్టాలు కొంతైనా తీరతాయని నమ్మి మోసపోతారని, నిరుద్యోగులు జాబ్ పోర్టల్స్ లో రెజ్యూమెలు అప్ లోడ్ చేస్తుంటారని,ఇదే అదునుగా భావించిన సైబర్ నేరగాళ్లు అప్‌లోడ్ చేసిన రెజ్యూమ్ ల నుంచి వివరాలను సేకరించి వారికి తరచూ ఫోన్‌లు చేస్తూ సంభాషణలు కొనసాగిస్తారని, రిజిస్ట్రేషన్ పేరిటగానీ లేక మరేదైనా కారణం చెప్పి తమ వ్యక్తిగత ఖాతాలో డబ్బులు జమ చేయమని మభ్యపెడతారని, అలా జమచేసిన వారు డబ్బు కోల్పోతారని, ఎలాంటి జాబ్ రాకపోగా డబ్బు తిరిగి రాదని అన్నారు. కంపెనీలు అధికారిక వెబ్‌సైట్లలోనే ఉద్యోగ ఖాళీల వివరాలను, అవసరాలను పొందుపరుస్తాయన్నారు. ఉద్యోగ ప్రకటన వెబ్సైట్ సరైనదో కాదో క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, అందులో పేర్కొన్న మొబైల్ నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తీసుకోకూడదని, స్వయంగా కార్యాలయాన్ని సంప్రదించాలని, అప్పుడే పూర్తి వివరాలు తెలుస్తాయని సూచించారు. ఏ సంస్థ/కంపెనీ ఐనా జీతాలు ఇచ్చి ఉద్యోగుల్ని నియమించుకుంటాయి కానీ డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇవ్వవనే అనే లాజిక్ కి గుర్తించాలన్నారు. "నేను వెళ్లేది పని చేయడానికి.. మరి అలాంటప్పుడు నేనెందుకు డబ్బు చెల్లించాలి? అని ఒక్కసారి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవాలని, బ్యాంక్ అకౌంట్స్, టాక్స్ ఫామ్స్, పాన్ నెంబర్, ఆధార్ కార్డ్.. లాంటివాటిని అడుగుతున్నారంటే అనుమానించాలని, అపరిచితులకు డబ్బులు బదిలీచేసే ముందు తార్కికంగా ఆలోచించాలని హెచ్చరించారు. ఆన్లైన్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైన ఈ తరహా మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చెయ్యాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని కర్నూలు జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలకు తెలియజేశారు.

## యాదవులకు చేయూతనిచ్చింది జగనే..!

● ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్



**ప్రొద్దుటూరు, మార్చి 3(శ్రీచక్ర) :**

రాష్ట్రంలో యాదవులకు అన్ని విధాలా చేయూత నిచ్చి ఆదుకున్నది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం జమ్మలమడుగు లోని ఎస్.వి. ఫంక్షన్ హాల్ నందు యాదవుల ఆత్మీయ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆర్. రమేష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిలకు సమన్యాయం జరిగిందంటే అది వైసిపి ప్రభుత్వంలోనేనని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా యాదవులకు కూడా అనేక రకాల ఆదుకోవడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు యాదవుల గురించి పట్టించుకోక పోతే అధికారంలోకి వచ్చిన వెంటనే సిఎం జగన్ మోహన్ రెడ్డి అన్ని విధాలా ఆదుకోవడం జరిగిందని ఆయన వివరించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే మూలె సుధీర్రెడ్డి ఆధ్వర్యంలోఎమ్మెల్సీ రమేష్ యాదవ్ సభాధ్యక్షులుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కడప ఎంపీ వై.యస్. అవినాష్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ సురేష్ బాబు, జమ్మలమడుగు శాసనసభ్యులు యమ్. సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ పి. బాలయ్య , కొప్పుల శివ యాదవ్, బంగారు నాగయ్య యాదవ్, వైయస్ఆర్ జిల్లా లోని వైసీపీ ముఖ్య నాయకులు, యాదవ ప్రముఖులు పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చి యాదవ ఆత్మీయ మహాసభ కార్యక్రమాన్ని జయప్రదం చేసిన వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, అభిమానులు, జమ్మలమడుగు నియోజకవర్గ యాదవ సోదరులకు అందిరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి వైసీపీ నాయకులు కార్యకర్తలు యాదవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టిడిపిలో చేరిక యడవల్లి గ్రామం 2వ వార్డు మెంబర్ కొత్తపల్లి

ఎర్రగొండపాలెం, మార్చి 03(శ్రీచక్ర) :

దోర్నాల మండలం యడవల్లి గ్రామం వైసిపి వార్డు మెంబర్ కొత్తపల్లి మరియు 10 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు సమక్షంలో టిడిపిలో చేరారు. వారిని ఎరిక్షన్ బాబు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరుషణ్ బాబుని పూలమాలతో సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ యర్రగొండపాలెంలో వెనుకబడిన బడుగు బలహీన వర్గాలకు ప్రాంత ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యంగా నేను ఎర్రగొండపాలెం ప్రతినిధిగా పనిచేస్తున్నాను. మా అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు నాపై ఉంచిన నమ్మకాన్ని యర్రగొండపాలెం ప్రజలకు సేవచేసి నిలబెట్టుకుంటానని యర్రగొండపాలెం ప్రజానీకానికి తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో దోర్నాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మురారిపల్లి గ్రామ వైయస్సార్ కాంగ్రెసు పార్టీ సీనియర్ నాయకులు టీడీపీలో చేరిక



ఎర్రగొండపాలెం, మార్చి 03 (శ్రీచక్ర) :

యర్రగొండపాలెం మండలం మురారిపల్లి గ్రామ వైసిపి సీనియర్ నాయకులు బాశం లక్ష్మిరెడ్డి ముందుగా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు కి బుకే ఇచ్చి ఘనంగా సన్మానం చేశారు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరుషణ బాబు సమక్షంలో టిడిపిలో చేరారు. వారిని ఎరిక్షన్ బాబు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో వైసిపి సర్పంచ్ గా పోటీ చేసి ఓడిపోయినప్పటినుండి వైసీపీలో కీలకంగా ఉన్నామని, అయితే గ్రామంలో వైసీపీ ఎటువంటి అభివృద్ధి పనులు చేయకపోవడం, తో వైసిపి ప్రభుత్వ విధానాలు నచ్చకపోవడంతో తాము టిడిపిలో చేరినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీటి బిల్లులు మంజూరు చేయండి



యర్రగొండపాలెం, మార్చి 03(శ్రీచక్ర) :

యర్రగొండపాలెం ఆర్అండ్బీ బంగ్లాలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌తో సమావేశమైన యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్. యర్రగొండపాలెం నియోజకవర్గంలో తాగునీటి సమస్యలపై,రావాల్సిన నీటి ట్యాంకర్ల బకాయిల పై,ఆర్వో ఎఫ్ ఆర్ భూసమస్యలపై,వెలుగొండ ప్రాజెక్ట్ భునిర్వాసితుల సమస్యలపై జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తో,ఫారెస్ట్ అధికారులతో చర్చించిన యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్.

## పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయిద్దాం రహిత భారతాన్ని నిర్మిద్దాం: తాటిపర్తి చంద్రశేఖర్

ఎర్రగొండపాలెం, మార్చి 03 (శ్రీచక్ర) :



యర్రగొండపాలెం పట్టణంలో పల్స్ పోలియో ఆదివారం ఈ కార్య క్రమంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ చిన్నారులకు పోలియో చుక్కలు ఎంతో అవసరమని దేశంలో పోలియో రహిత సమాజం నిర్మించడమే ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిండు జీవితానికి రెండు చుక్కలు చాలా అవసరమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. 0. నుండి 5 సంవత్సరాలలోపు ప్రతి ఒక్క పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావు జడ్పిటిసి చేదురి విజయభాస్కర్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉడుముల శ్రీనివాస్ రెడ్డి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒంగోలు మూర్తి రెడ్డి వైసీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ఆచంటలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



భీమవరం, మార్చి 3 (శ్రీచక్ర) :

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల్లో గ్రామ సచివాలయాలు, కమ్యూనిటీ హాల్సు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లును ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాలను ఆచంట శాసన సభ్యులు, మాజీ మంత్రి వర్యులు చెరుకుకువాడ శ్రీ రంగ నాధ రాజు ఆధ్వర్యంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, రాజ్యసభ సభ్యులు, పిల్లి సుభాష్ చంద్రబోస్ , ఎమ్మెల్సీ వంకా రవీంద్ర నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు శ్రీరామరక్ష

- ఆకుపాటి వెంకటేష్, డాక్టర్ రవళి ప్రియాంక



పామూరు, మార్చి 3 (శ్రీచక్ర) :

పామూరు పట్టణంలోని అంకాలమ్మ వీధి నందు జాతీయ పల్స్ పోలియో కార్యకమంలో భాగంగా పట్టణ రెండో ప్రదేశిక ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, ప్రభుత్వ వైద్యురాలు రవళి ప్రియాంక లు చిన్నారికి పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకుపాటి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ వైద్యరంగం పోలియోను అరికట్టే స్థాయికి ఎదిగింది అని, చిన్న బిడ్డను కలిగిన ప్రతి తల్లి ఈ పోలియో చుక్కలు బిడ్డలకు వేపించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యురాలు రవళి ప్రియాంక, ఎఎన్ఎమ్ ఒంగోలు ప్రేమమ్మ, సిహెఓ సురేష్, ఏడ్యూ కృష్ణవేణి అంగన్వాడి ధనలక్ష్మి, ఆశ కార్యకర్త లావణ్య పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు



ఎర్రగొండపాలెం, మార్చి 03 (శ్రీచక్ర) :

దోర్నాల పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం నందు ఆర్యవైశ్యులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, గత చంద్రబాబు గారి ప్రభుత్వంలో జరిగిన దేవాలయాల అభివృద్ధి, ఆర్యవైశ్యుల సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేశారు. రాబోయే ఎన్నికలలో ఆర్యవైశ్యులు ఏకతాటిపై నిలబడి తెలుగుదేశం పార్టీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దోర్నాల మండల ఆర్యవైశ్య నాయకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## భీమవరంలో జనసేన నుంచి వైసీపీలో చేరికలు

భీమవరం, మార్చి 3 (శ్రీచక్ర) :



భీమవరంలో జనసేనకు భారీ షాక్ తగిలింది. జనసేనకు కీలకంగా ఉన్న గునుపూడికి సంబంధించిన పలు వార్డులతో పాటుగా ఇతర వార్డుల నుండి కూడా జన సైనికులు ఆదివారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసీపీ పార్టీలో చేరారు. వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటి జనసైనికులు గతంలో తన వెంటే ఉన్నారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, కట్రెడ్డి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాపురంలో పల్స్ పోలియో కేంద్రాన్ని ప్రారంభించిన శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు



భీమవరం, మార్చి3 (శ్రీచక్ర) :

పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం దుర్గాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డి ఎంహెచ్ఓ డాక్టర్ డి.మహేశ్వర రావు,ఆర్ డి ఓ శ్రీనివాసులరాజు, గవర్నమెంట్ డాక్టర్స్ సామాజిక కార్యకర్త రంగ సాయి పాల్గొన్నారు.

## వైభవంగా కనకదుర్గమ్మ వారి 25వ వార్షికోత్సవ వేడుకలు

- రావిచెట్టు,దేవుని విగ్రహాలకు జలాభిషేకం చేసిన భక్తజనం
- భారీగా మహన్నదానం



చింతూరు, మార్చి3 (శ్రీచక్ర):

చింతూరు మండల కేంద్రం శబరి ఒడ్డున వెలసిన కనక దుర్గమ్మ వారి 25వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ ఆదివారం వైభవంగా నిర్వహించడం జరిగింది.ఉదయం నుంచి భక్తులు శబరినది నుంచి జలాన్ని సేకరించి అమ్మవారి ఆలయం వద్ద ఉన్న రావిచెట్టు, దేవుని విగ్రహాలకు జలాభిషేకం చేశారు.చిన్నారులు,మహిళలు, పురుషులు అందరూ కలిసికట్టుగా శబరి జలాలతో జలాభిషేకం కార్యక్రమంలో పాల్గొని వారి భక్తిని చాటుకున్నారు.ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు కలగ.వరప్రసాద్ శర్మ,గోకవరం పూజారి కోట.చైతన్య శర్మ ఆధ్వర్యంలో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించడం జరిగింది.తదుపరి మధ్యాహ్నం మహన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులు విశేషంగా పాల్గొన్నారు.మూడు రోజులపాటు కనకదుర్గమ్మ ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దీవెనలు అందే విధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి,నరెడ్ల సత్తిబాబు,శేఖర్,ధర్మ తేజ రవితేజలు ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది.



# రామచంద్రపురంలో ఉమ్మడి అసెంబ్లీ టిక్కెట్‌పై టీడీపీ-జనసేన వార్!





- టీడీపీకే అసెంబ్లీ టిక్కెట్ అంటూ సోషల్ మీడియాలో ప్రచారంపై జనసైనికులు ఆగ్రహం!
- రామచంద్రపురంలో టీడీపీ ఇన్‌చార్జీని ముట్టడించిన జనసైనికులు
- పొత్తుధర్మ ఇదేనా అంటూ జనసేన ఇంచార్జి చంద్రశేఖర్ ఫైర్
- అసహనం వ్యక్తం చేసిన ఇంచార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం
- గ్రామాల్లో టిక్కెట్ నాదేనంటూ మద్దత్తు కోరుతున్న సుభాష్ పైనా టీడీపీ-జనసేన శ్రేణులు ఆగ్రహం
- సుభాష్ పేరుతో ప్లేకార్డులు దహనం, రౌడిసీటర్ సుభాష్‌కి టిక్కెట్ ఇస్తే ముకుమ్మడి రాజీనామాలు చేస్తా

**రామచంద్రపురం, మార్చి 3(శ్రీచక్ర) :**

రామచంద్రపురంలో టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్ధి విషయంలో సోషల్ మీడియాలో టిక్కెట్ తమదే నంటూ అల్చల్ చేస్తున్న పోస్ట్ తోపాటు, ఇటీవల టిడిపిలో చేరి అదిష్టానం టిక్కెట్ తనకే నంటూ గ్రామాల్లో తిరిగి మద్దత్తు కోరుతున్న సుభాష్ విషయంలో జనసేన శ్రేణుల్లో ఆగ్రహం తారాస్థాయికి చేరుకుంది. దీంతో పోత్తుదర్మం ఇదేనా అంటూ టిడిపి ఇంచార్జి రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని పలువురు జనసైనికులు చుట్టుముట్టి నిలదీశారు. దీంతో టీడీపీ ఇంచార్జి ఎమిచెప్పని పరిస్థితిలో అయోమయంలో ఇక్కడ సఘటన పడేసింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం రామచంద్రపురం టీడీపీ ఇంచార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం ఇంటివద్ద ఈసంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రెడ్డి సుబ్రహ్మణ్యం ఆదివారం ఆపార్టీ శ్రేణులకు విస్తృత స్ధాయి సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో రామచంద్రపురం అసెంబ్లీ టిక్కెట్ రెడ్డి సుబ్రహ్మణ్యం బార్యదే నని సోషల్ మీడియాలో రెండు రోజులు నుంచి చక్కెర్లు కొడుతుండగా ,మరో పక్క ఇటీవల టిడిపిలో చేరిన వాశంశెట్టి సుభాష్ ,ఆయన తండ్రి నియోజకవర్గంలో పలువురు టీడీపీ-జనసేన నేతలను కలిసి మద్దత్తు కోరటంతో జనసైనికుల్లో పోత్తుదర్మం పాటించడం లేదని ఆగ్రహం ఆవేశాలు ఒక్కసారిగా తీవ్ర మై జనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తోపాటు పలువురు జనసైనికులు బైక్ ర్యాలీతో బయలుదేరి సుబ్రహ్మణ్యం ఇంటికి చేరుకునిఆయనని నిలదీశారు. సుబ్రహ్మణ్యం జనసైనికులను శాంతింపచేసి ఇక్కడ జరుగుతున్న పరిణామాలకు తనకెటువంటి సంబందంలేదని ఇంచార్జి చంద్రశేఖర్ కి ఆపార్టీ శ్రేణులు కు వివరించి శాంతపరిచి విస్తృత సమావేశంలో పాల్గొనేలా చేసారు. దీంతో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇక్కడ కొన్ని దుష్ట శక్తులు ఇంచార్జి తో ప్రమేయంలేకుండా తప్పుడు ప్రచారంతో పార్టీ కి చెడ్డపేరు తెస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే తమపట్ల కార్యకర్తలు మంచిచేస్తున్నామని బావించి సోషల్ మీడియాలో ఉత్తిత్తి పోస్ట్ లు పెట్టి పరువు తీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తనకు తెలియకుండా తనబార్యకు టిక్కెట్ ఎలావస్తాదని ప్రశ్నించారు. అదిష్టానం టీడీపీ తరపున తనకు టిక్కెట్ ఇస్తే పోటిచేయడాని సిద్ధంగా ఉన్నాననిఅన్నారు. అలాగే జనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అర్హుడని ఆయన పార్టీకి నాటి నుండి నేటివరకూ సేవలు చేస్తు పార్టీ ఆదేశాలు ప్రకారం నడుకుంటూ పోతున్నారని అలాంటి వ్యక్తికి టిక్కెట్ విషయంలో తనమద్దత్తు పూర్తిగా ఉంటాదని సభాముఖంగా తెలిపారు. అవసరమైతే తను సిపార్సుచేస్తనని అన్నారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను మెగాఫ్యామిలీ అబిమానినని ఆఆలోచనతో పార్టీ సిద్దాంతాలకు ఆకర్షతిడునై పార్టీ లో చేరి తనవంతు సేవచేయడం జరుగుతుందనిఅన్నారు. అనంతరం పలువురు టీడీపీ జనసేన శ్రేణులు మాట్లాడుతూ సుభాష్ టిక్కెట్ ఇవ్వరాదని ఇస్తే మూకుమ్మడిగా రాజీనామా లు చేస్తామని హెచ్చరించారు. ఈలోగా టీడీపీ కార్య వనుం చంటి డీజిల్ డబ్బాతో ప్రత్యక్ష మై ఒంటిపై పోసుకుని ఆత్మహత్య ప్రయత్నం చేసుకోబోగా పలువురు అడ్డోచ్చి వారించి తీసుకుని వెళ్ళిపోయారు. దీంతో ఇక్కడ కు చేరిన వందలాది సుభాష్ కు వ్యతిరేకంగా ప్లేకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం ఆకార్డులను తగలబెట్టి నినాదాలు చేసారు.



## కొత్త మూలపేట గ్రామంలో పల్స్ పోలియో కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ పెనుమల్లు వెంకట కుమారి



**పిఠాపురం/ యు. కొత్తపల్లి, మార్చి 3(శ్రీచక్ర) :**

కాకినాడ జిల్లా, యు. కొత్తపల్లి మండలం, కొత్త మూలపేట గ్రామ పంచాయితీ వద్ద, సర్పంచ్ పెనుమల్లు వెంకట కుమారి ఆదివారం పోలియో చుక్కలు వేయడం ప్రారంభించారు. 5 సంవత్సరాల లోపు ఉన్న చిన్నపిల్లలు అందరికీ పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పచ్, మరియు ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

## ప్రతిభగల తెలుగు కవులకు ఘన సత్కారం!

- పల్లిపాలెంలో మధుశ్రీ కథా గౌరవసభలో పురస్కారాలు.
- పౌండేషన్ అద్యక్షులు కిరణ్ చేతులమీదుగా నగదు బహుమతులు అందజేత








**రామచంద్రపురం, మార్చి 3(శ్రీచక్ర) :**

తెలుగు కథా సాహిత్యంలో ఆరితేరిన కవులు కనబరిచి ప్రతిభకు పలువురు కథారచయితలకు ఘనంగా సత్కరాలు చేయడం జరిగింది. ఈమేరకు ఆదివారం కాకినాడ జిల్లా కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామంలో మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణం నందు మధునా పంతుల సత్యనారా యణమూర్తి ,చలపతిల అధ్యక్షతన మధుశ్రీ కథా గౌరవ సభ అత్యంత వైభవంగా నిర్వహించారు.. తెలుగు కథా సాహిత్యంలో ఆరి తేరిన పలువురు కథా రచయితలు ఈసందర్భంగా ఈ సభకు విచ్చేశారు. ఈ సమావేశంలో మధునాపంతుల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మధునాపంతుల కిరణ్ మాట్లాడుతూ తన తండ్రి మధుశ్రీ రాసిన కదలన్నిటినీ పాఠకులచే చదివించాలనీ,ఆ కథలను చదివి మరింత మంది తెలుగు కదా సాహిత్యం వైపుకు ఆకర్షితులై రచయితలుగా మారాలనే సదుద్దేశంతో ఆయన కథలన్నిటినీ మధుశ్రీలు అనే పుస్తకాన్ని పబ్లిష్ చేయడం జరిగిందని అన్నారు. తన తండ్రి మధు శ్రీ జ్ఞాపకార్థం ప్రతి ఏటా ప్రతిభ గల ముగ్గురు కథా రచయితలను ఎంపిక చేసి వారికి నగదు పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేయడం జరుగుతుందని కిరణ్ ఈసందర్భంగా తెలిపారు. 2022 సంవత్సరం నుంచి ప్రతి ఏటా విధిగా జనవరి ఫిబ్రవరి మాసాల్లోఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే ప్రస్తుతం ఈరోజు గత సంవత్సరం మాదిరిగా మధుశ్రీ కదా గౌరవ సభను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సందర్భంగా కమిటీ సభ్యులుగ ప్రముఖ కథల విశ్లేషకులు వంశీకృష్ణ , మల్లేశ్వరరావు, అనిల్ డ్యానీ లు ద్వారా ప్రతిభ గల ముగ్గురు రచయితలను ఎంపిక చేసాన్నారు. వారిలో ప్రఖ్యాత రచయిత చింతకింది శ్రీనివాస రావు, ఎండపల్లి భారతి,భగవంతం ముగ్గురు కదా రచయితలను ఎంపిక చేసి నగదు పురస్కారాలను అందించి గౌరవించడం జరిగిందన్నారు. ఈసందర్భంగా సభలో చింతకింది కి 20వేలు,భారతి కి 20వేలు భగవంతం కి 10 వేల రూపాయలు నగదుతోబాటు జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో వివోద ప్రాంతాల నుండి తరలి వచ్చిన పలువురు కథారచయితలు ,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే



**మర్రిపాడు, మార్చి3(శ్రీచక్ర) :**

చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పక వేయించాలని, పోలియో మహమ్మారి నుంచి చిన్నారులను కాపాడేందుకు ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ప్రతి ఒక్కరూ తమ చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించేలా చూడాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా మర్రిపాడు మండలంలోని బ్రాహ్మణపల్లిలో ప్రాధమిక పాఠశాలలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ పోలియో నివారణకు ఏకైక మార్గం టీకా, ఓరల్ పోలియో వ్యాక్సిన్ అని, 0-5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు వైద్యారోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్ వాడీలు ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను పోలియో చుక్కలు వేసే కేంద్రాలకు తీసుకెళ్లి తప్పక పోలియోచుక్కలు వేయించాలని అన్నారు. ఆయన వెంట వైద్యసిబ్బంది, వైఎస్సార్సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## చంద్రబాబును ప్రత్యేకంగా కలిసిన మాజీ జడ్పీ ఛైర్మన్





**నెల్లూరు బ్యూరో, మార్చి 3 (శ్రీచక్ర) :**

నెల్లూరులో శనివారం నాడు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు జిల్లాకు విచ్చేసిన సందర్భంగా మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంచల బాబు యాదవ్ ఆయనను పూలమాలతో ఘనంగా సత్కరించారు. వేమిరెడ్డి దంపతులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్న సందర్భంగా విచ్చేసినటువంటి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ను వేదికపై మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పూలమాలతో సత్కరించారు. కార్యక్రమం అనంతరం చంద్రబాబును హెలిపాడ్ దగ్గర ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ బిసి సీనియర్ నాయకులు మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంచల్ బాబు యాదవ్ మాట్లాడుతూ భవిష్యత్తులో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు లో జిల్లాలో పార్టీ గెలుపుకు కృషి చేయాలని అలాగే ఉదయగిరి నియోజకవర్గం లోను గెలుపుకు అందరూ కలిసి కృషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు తెలియజేశారు. అలాగే జిల్లాలో మీరు చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లో విస్తృతంగా వెళుతుందని ఎన్నికల సమీపిస్తున్న వేళ మరింతగా కృషి చేయాలని అన్నారు. అలాగే మీకు మంచి భవిష్యత్తు ఉందని, పార్టీ మిమ్మల్ని మరింతగా ముందుకు తీసుకొని వెళుతుందని మీకు అండగా నేనున్నానని భరోసా కల్పించారు.

## జొన్నలగడ్డ రామానాయుడు మృతి తెదేపాకు తీరని లోటు

**ఉదయగిరి/కొండాపురం, మార్చి 3 (శ్రీచక్ర) :**




కొండాపురం మండల కన్వీనర్ మామిళ్ళపల్లి ఓంకార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వింజమూరు సమితి మాజీ అధ్యక్షులు జొన్నలగడ్డ రామానాయుడు అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసినది అని అన్నారు. రామానాయుడు రాజకీయాలలో నిస్వార్ధంగా, విలువలతో ,నీతి నిజాయితీగా ఎటువంటి అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవ చేసిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. ఆయన మరణం తెలుగుదేశం పార్టీకి ముఖ్యంగా ఉదయగిరి నియోజకవర్గ మెట్ట ప్రాంతానికి తీరని లోటని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

email: sreechakratelugu@gmail.com
శ్రీచక్ర నెల్లూరు/వెస్ట్‌గోదావరి

# కాకర్ల సురేష్‌ను కలిసిన పలువురు జనసేన నాయకులు

**ఉదయగిరి/వింజమూరు మార్చి 3 (శ్రీ చక్ర) :**

ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం - జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ను నియోజకవర్గంలోని జనసేన నాయకులు నిమ్మలపల్లి రామ్ చైతన్య, కొల్లు అన్వేష్, ఆకుల వెంకట్,పఠాన్ రసూల్, గుండబత్తిన రామ్మూర్తి తదితరులు మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ తమ మద్దతు పూర్తి ఉంటుందని అలాగే నియోజకవర్గంలో ఎక్కడ ఎలాంటి సహాయ సహకారాలు అయినా అందిస్తామని ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ కు తెలిపారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సురేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గత రెండేళ్లుగా తమ ట్రస్టు ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నానని అలాగే సేవలందించే క్రమంలో పల్లె పల్లెకు వెళ్లానని ప్రజలు కష్టాలు తెలుసుకున్నానని అంతేకాకుండా నియోజకవర్గంలో సాగునీరు తాగునీరు కు ఇబ్బందులు ఉన్నాయని, గ్రామాల్లో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఇలా అనేక విధాలుగా ప్రజల యొక్క కష్టాలు గుర్తించానని తెలిపారు. భవిష్యత్తులో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ జెండా ఎగరవేసేందుకు కృషి చేద్దామని తద్వారా రాష్ట్రంలో మళ్లీ తిరిగి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడును చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మరో నాలుగైదు రోజుల్లో ఎన్నికల ప్రచారం మొదలు పెడతానని ఈ సందర్భంగా వారికి తెలియజేశారు. గత రెండు నెలలుగా నియోజకవర్గంలో తెలుగుదేశం జనసేన ఇరువురు కలిసి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోనూ మరియు రాష్ట్రంలోనూ వైఎస్సార్సీపీని ఇంటికి సాగనంపాల్సిన అవసరం ఉందని అందుకోసం ప్రతి ఒక్కరు ఏకమై సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ అభివృద్ధికి 5లక్షలు విరాళం

- స్వంత నిధులు అందచేసిన ఎమ్మెల్యే




**మర్రిపాడు, మార్చి3 (శ్రీచక్ర) :**

మర్రిపాడు మండలం నందవరంలోని శ్రీ విశాలాక్షీ సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధి పనులకు ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాట విక్రమ్ రెడ్డి తమ స్వంత నిధులు రూ. 5లక్షలు అందచేశారు. ఆదివారం బ్రహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో నందవరం వైఎస్సార్సీపీ నాయకులకు రూ. 5లక్షల చెక్కును అందచేసి ఆలయ అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు. ఇటీవలే శ్రీ విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన విగ్రహప్రతిష్ట, నవగ్రహ సహిత, జీవధ్వజ, కుంభాభిషేక, నాగప్రతిష్ట కార్యక్రమాలకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి తన తండ్రి నెల్లూరు పార్లమెంట్ మాజీ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డితో కలసి హాజరైన విషయం విధితమే. ఆ సమయంలో గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొచ్చిన ఆలయ అభివృద్ధి పనుల కోసం స్వంత నిధుల అందచేస్తామని తెలిపిన ఎమ్మెల్యే మేకపాటి ఆదివారం ఆ మేరకు రూ. 5లక్షలను ఆ గ్రామప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకులకు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ గతంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా రూ. 5లక్షలు మంజూరు చేయించారని, ప్రస్తుతం దేవాదాయశాఖ ద్వారా కామన్ గుడ్ ఫండ్ కింద రూ. 5లక్షలు, తమ స్వంత నిధులు రూ. 5 లక్షలను అందించి ఆలయ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందించామని, గ్రామస్తులు కోరిన మేరకు ఆలయాన్ని అభివృద్ధి చేసేలా పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

## జొన్నలగడ్డ రామానాయుడు మృతి

- సంతాపం తెలిపిన పలువురు రాజకీయ ప్రముఖులు, నాయకులు



**ఉదయగిరి/కలిగిరి, మార్చి 3 (శ్రీచక్ర) :**

సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రామానాయుడు అకాల మరణం జిల్లాలోని పలువురు రాజకీయ ప్రముఖులు నాయకులు కార్యకర్తలు తీవ్ర దృక్బంతి వ్యక్తం చేశారు. అనంతరం పలువురు రాజకీయ ప్రముఖులు, నాయకులు వారి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి , బొల్లినేని వెంకట రామారావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చంచల బాబు యాదవ్ తదితరులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, వింజమూరు సమితి మాజీ అధ్యక్షులు జొన్నలగడ్డ రామానాయుడు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసిన ఒక గొప్ప నాయకుడిని కోల్పోయాం అని విచారం వ్యక్తం చేశారు. 1981-%ా

## రామానాయుడు మృతి

- సంతాపం తెలిపిన కాకర్ల సురేష్



**ఉదయగిరి/కలిగిరి, మార్చి3(శ్రీచక్ర) :**

ఉదయగిరి తెలుగుదేశం - జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ కలిగిరి లోని సిద్ధనకొండురు గ్రామ వాస్తవ్యులు ,మాజీ వింజమూరు సమితి అధ్యక్షులు,టీడీపీ సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రామానాయుడు అకాల మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారికి సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆయన చేసిన సేవలు అలాగే తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి బైకు బోల్తా

- దుర్గయ్య అక్కడికక్కడే మృతి



**ఉదయగిరి/వరికుంటపాడు, మార్చి 3 (శ్రీ చక్ర) :**

వరికుంటపాడు మండలంలోని కాంచెరువు గ్రామానికి చెందిన జయంపు దుర్గయ్య అనే వ్యక్తి పామూరు కి వెళ్లి తిరిగి వస్తుండగా గొల్లపల్లి శివారులో ఏడవ నెంబర్ కాలువ మలుపు దగ్గర బ్రేక్ అదుపుతప్పి కాలవలో పడడంతో తలకి బలమైన బండరాయి తగిలి దుర్గయ్య అక్కడక్కడే మృతి చెందాడు. దుర్గయ్య కు భార్య ఒక బాబు ఇద్దరూ ఆడపిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలిసిన కుటుంబీకులు సంఘటన స్థలానికి వచ్చి చనిపోయిన దుర్గయ్య ను చూసి భోరున ఏడుస్తూ కన్నీరు మున్నేరయ్యారు. గొల్లపల్లి గ్రామస్తులు కాంచెరువు గ్రామస్తులు జరిగిన ప్రమాదాన్ని చూసిన ప్రతి ఒక్కరూ కన్నీరు మున్నీరయ్యారు . ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని జరిగిన ప్రమాదాన్ని అక్కడున్న వారితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సై కే తిరుపతయ్య తమ సిబ్బందితో కలిసి చనిపోయిన దుర్గయ్య ను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నామని అన్నారు.

## కాకర్ల సురేష్‌ని కలిసిన తెలుగుదేశం పార్టీ నాయకులు



**ఉదయగిరి/వింజమూరు, మార్చి3(శ్రీచక్ర) :**

వింజమూరు మండలంలో బొమ్మరాజు చెరువు గ్రామంలో కాకర్ల ట్రస్ట్ కార్యాలయంలో వరికుంటపాడు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా నియోజకవర్గ అభ్యర్థి కాకర్ల సురేష్ ను కలిశారు. వైస్ ఎంపీపీ దేవన బోయిన మధు, వెంగమ నాయుడు ఇరువురు కాకర్ల ట్రస్ట్ అధినేత తెలుగుదేశం జనసేన పార్టీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ ను శాలువా,పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ మాట్లాడుతూ నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని భవిష్యత్తులో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు అతి తక్కువ సమయం ఉన్నందున అందరం కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేయాలని అందుకు ప్రతి ఒక్కరు తమ సహాయ సహకారాలు గ్రామాల్లో అందించాలని కోరారు. ఉదయగిరిలో ఎమ్మెల్యేగా గెలిచి మాజీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకు కానుకగా ఇవ్వాలని అందుకు ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని నాయకులను కార్యకర్తలను ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. మండలంలో ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

## పోలియో రహిత సమాజం లక్ష్యం



**ఉదయగిరి/వరికుంటపాడు, మార్చి3(శ్రీచక్ర) :**

వరికుంటపాడు మండలంలో మండల వైద్యాధికారులు డాక్టర్ కరిష్మా ఆయేషా ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని సచివాలయ పరిధిలో స్థానిక ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం చేపట్టి ఐదు సంవత్సరాలు లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయడం జరిగిందని అన్నారు. అంతేకాకుండా స్థానిక మండల వైద్యాధికారులు ప్రత్యేక క్యాంపు నిర్వహించి మండలంలోని బొగ్గుబట్టీలు, పలుకు రాయి యాడ్లు ప్రదేశాలు సందర్శించి అక్కడ పని చేస్తున్నటువంటి కూలీలు ప్రజలు వారి పిల్లలకు పల్స్ పోలియో చుక్కల వేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారులు డాక్టర్ కరిష్మా, డాక్టర్ ఆయేషా మాట్లాడుతూ దేశంలో పోలియో రహిత సమాజం నిర్మించడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అందులో భాగంగానే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఆ క్రమంలో జిల్లాలోనూ జిల్లా వైద్య అధికారులు ఆదేశాల మేరకు మండలంలోని 3254 పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వెయ్యాలని టార్గెట్ ఇవ్వగా 3162 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయడం జరిగిందని దాదాపుగా 97% పూర్తి చేసామని రేపు ఎల్లుండిలో పూర్తిస్థాయి టార్గెట్ పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజశేఖర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లింగారాయుడుగూడెం రైతులతో చిరకాల అనుబంధం : ఆర్‌బికే

ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం కొట్టు

**తాడేపల్లిగూడెం, మార్చి 03 (శ్రీచక్ర) :**




లింగారాయుడు గూడెం గ్రామ రైతులతో తనకు చిరకాల అనుబంధం ఉందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలం దండగర్ర గ్రామ పంచాయతీ పరిధిలోని లింగారాయుడు గూడెం గ్రామంలో ఆదివారం రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి ఎంపీటీసీ పరిధిలో మూడు గ్రామాలు ఉండడంతో సచివాలయం, ఆర్ బి కే, వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఈ మూడు గ్రామాలలోనూ ఒక్కోటి ఒక్కో గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. లింగారాయుడు గూడెం గ్రామ రైతులు కూరగాయలు పండించడం అనాదిగా వస్తుందని, దీంతో గతం నుంచి ఈ గ్రామ రైతులతో తనకు చిరకాల అనుబంధం ఏర్పడిందన్నారు. ఇక్కడ రైతులు పండించే కూరగాయలను గూడెం మార్కెట్లోకి తీసుకువచ్చి తమకు సరఫరా చేసేవారని ఈ విధంగా ఈ గ్రామ రైతులకు తనకు ఎంతో కాలం నుంచి అనుబంధం ఏర్పడిందన్నారు. గ్రామంలో ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీ సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందించమన్నారు. దీనికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. వైకాపా ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గ్రామంలో పేదలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఒక వృద్ధ మహిళ పెన్షన్ డబ్బులతో హాయిగా జీవించగలుగుతున్నానని ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ అందరి సమక్షంలోను బహిరంగంగా ప్రకటించడం విశేషం. మళ్లీ ఇదే ప్రభుత్వం వస్తుందని మళ్లీ నువ్వే గెలుస్తావ్ బాబు అంటూ కొట్టును ఆప్యాయంగా ఆశీర్వదించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, ఎంపీటీసీ వీరమల్ల వెంకన్న, యాతం సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ములకాల గంగారావు, పచ్చ రాజు, అగ్రికల్చర్ ఏడి మురళీకృష్ణ, పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల బంగారు భవిష్యత్తుకు రెండు చుక్కలు

● పల్స్ పోలియో కార్యక్రమంలో మంత్రి కొట్టు

**తాడేపల్లిగూడెం, మార్చి 03 (శ్రీచక్ర) :**

పోలియో వ్యాధి నిర్మూలనకు గాను పిల్లలకు నేడు వేసే రెండు చుక్కలు వారికి బంగారు భవిష్యత్తును ఇస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలం దండగర్ర పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఆయన పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో నిర్మూలన చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత కొన్నేళ్లుగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల లోపు వయసు కలిగిన చిన్నారులందరికీ పోలియో చుక్కలు ఖచ్చితంగా వేయించాలన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి కొట్టు సూచించారు. భారతదేశంలో పోలియో పూర్తిగా నిర్మూలించగలిగినప్పటికీ ఇతర దేశాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. పోలియో నిర్మూలనకు చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రి కొట్టు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, ఎంపీటీసీ వీరమల్ల వెంకన్న, యాతం సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ములకాల



గంగారావు, గంటి సత్యనారాయణ పస్పా రాజు, పచ్చ బేబీ రాణి, సత్తి దుర్గారావు, సతినిడి కొండలరావు, గరగ రాంబాబు, మాధవరం పీహెచ్సీ వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరిగడ్డి దగ్ధం

● రూ 30 వేల ఆస్తినష్టం ● ఆర్వపల్లిలో ఘటన



**పోలవరం నియోజకవర్గం ప్రతినిధి, మార్చి 03 (శ్రీచక్ర) :**

ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో వరిగడ్డి దగ్ధమైన ఘటన ఆదివారం కుక్కునూరు మండలంలో జరిగింది.బాధితుల వివరాల ప్రకారం..ఆర్వపల్లి గ్రామానికి చెందిన అమరవరపు. వెంకట్రావు,మడకం. సిరమయ్య అనే రైతులు కొంత వరిగడ్డిని ఇంటి సమీపంలో ఉంచారు.కాగా మధ్యాహ్నం ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో వరిగడ్డి పూర్తిగా కాలి బూడిదైంది. ఎటువంటి హాని జరగలేదు. సుమారు రూ 30 వేల ఆస్తినష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. కాగా ప్రమాదానికి గల కారణం తెలియాల్సి ఉంది.

## ఈతకోట తాతాజీ చేతుల మీదుగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతి ప్రధానోత్సవం





**తాడేపల్లిగూడెం, మార్చి 03 (శ్రీచక్ర) :**

శశి కాలేజీ ప్రక్కన గ్రౌండ్స్‌లో బొలిశెట్టి రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఈతకోట భీమశంకర్ రావు (తాతాజీ) బిజెపి తాడేపల్లిగూడెం నియోజకవర్గం కన్వీనర్,శ్రీ బొల్లిశెట్టి రాజేష్ మరియు పాలూరు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరిగింది. తాతాజీ మాట్లాడుతూ యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా ఇటువంటి క్రీడల్లో పాల్గొని మంచిగా జీవించాలని, ఆ క్రీడా ప్రాంగణాన్ని భవిష్యత్తులో ఒక సుందరమైన క్రీడా ప్రాంగణముగా నిర్మించుకోవాలని దానికి తగిన సహకారం తమ వంతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు.

## మా తనయుడు బొలిశెట్టి రాజేష్ యువతకు ఆదర్శం

● మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో బొలిశెట్టి శ్రీనివాస్




**తాడేపల్లిగూడెం, మార్చి 3 (శ్రీచక్ర) :**

జనసేన పార్టీ ఇంచార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు రాజేష్ నిర్వహించిన టెన్నిస్ బాల్ మెగా టోర్నమెంట్ లీగ్ ఆదివారం జరిగిన ఫైనల్‌లో బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మొదటి బహుమతి 30,000 రెండవ బహుమతి 20,000 ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ 6,000 మరియు ట్రోఫీలను విజేతలకు శ్రీనివాస్ మరియు రాజేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జనసైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

## నా కుటుంబ సభ్యులు ఎవరూ రాజకీయాల్లోకి రావట్లేదు

● మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్




**పెదవేగి, మార్చి 03(శ్రీచక్ర) :**

మండలంలోని దుగ్గిరాల గ్రామంలో చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన దెందులూరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు టిడిపి జనసేన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శంఖారావం కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడం లో ప్రతి ఒక్కరూ ప్రత్యేక కృషి చేయాలని, సూపర్ 6పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేలా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నాయకులు నారా లోకేష్ ఈ కార్యక్రమాన్ని రూపొందించారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. చింతమనేని మాట్లాడుతూ బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం లాగానే, సూపర్ 6 పథకాలను, చంద్రన్న విజన్ ను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకు వెళ్ళటానికి ఈ శంఖారావం కార్యక్రమం దోహద పడుతుందని, ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్త ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్ళటంలో ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే అవాస్తవాలని చూసి ఎవరూ అపోహ పడి, అధైర్య పడొద్దని, తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాలకు రారని చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దెందులూరు అంటే చింతమనేని అని, చింతమనేని అంటే దెందులూరు అని, రాజకీయాల్లో ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొని వచ్చిన వ్యక్తిని అని, నాయకులు కార్యకర్తలు సంయమనం పాటించాలని చింతమనేని ప్రభాకర్ కోరారు.

## ఒంటిమిట్ట శ్రీరాముల వారి కళ్యాణం...కమనీయం

తాడేపల్లిగూడెంలో ధర్మ ప్రచార మహోత్సవం



**తాడేపల్లిగూడెం, మార్చి 03 (శ్రీచక్ర) :**

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సారధ్యంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ధార్మిక పరిషత్ నిర్వహణలో జరుగుతున్న ధర్మ ప్రచార మహోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీరాముల వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. శ్రీరాములవారు కళ్యాణమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఒంటిమిట్ట దేవస్థానం నుంచి వచ్చిన వేద పండితులు, అర్చక స్వాములు అక్కడ ఒంటిమిట్టలో ఏ రీతిన అయితే రాములవారి కళ్యాణం నిర్వహిస్తారో అదే రీతిన ఇక్కడ తాడేపల్లిగూడెంలో జరుగుతున్న ధర్మ ప్రచార మహోత్సవంలోనూ నిర్వహించారు. మంత్రి కొట్టు కుటుంబీకులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ఒంటిమిట్ట శ్రీరాముల వారి కళ్యాణాన్ని తిలకించారు.



## మూడు రోజులు కొనసాగనున్న పల్స్ పోలియో 57 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు



**గూడూరు రూరల్, మార్చి 3 (శ్రీచక్ర):**

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన మున్సిపాలిటీ కమిషనర్ వెంకటేశ్వర్లు ఎమ్మార్వో కరుణ్ కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతున్న విషయం తెలిసిందే ఈ క్రమంలో భాగంగా గూడూరు నియోజకవర్గంలోనూ పలు ప్రాంతాల్లో పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది పోలియో చుక్కలను చిన్నారులకు ఇస్తున్నారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు అందరికీ ఈ పోలియో చుక్కలు వేస్తున్నారు. గూడూరు పట్టణం మొత్తం మీద 57 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి వైద్య సిబ్బందితో పాటు ఆశ వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు పోలియో చుక్కలను వేస్తున్నారు. ఆర్డిఓ కిరణ్ కుమార్ పల్స్ పోలియో తీరును పర్యవేక్షిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు గూడూరు తహసిల్దార్ కరుణ్ కుమార్ పల్స్ పోలియో ఏర్పాట్లను పరిశీలించారు.

## అయ్యవారిపాలెం గ్రామం నుండి తెలుగుదేశం పార్టీలోకి భారీ చేరికలు



**గూడూరు, మార్చి 03(శ్రీచక్ర) :**

వైఎస్ఆర్సిపి పార్టీకి చెందిన మేనకూరు కృష్ణారెడ్డి బచ్చల రాజేష్ రెడ్డి ఉచ్చూరు ముని కృష్ణారెడ్డి లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పాశిం సునీల్ కుమార్ తిరుపతి జిల్లా గూడూరు మండలం అయ్యవారిపాలెం గ్రామపంచాయతీ నందు ఆదివారం నాడు వైఎస్ఆర్సిపికి చెందిన ముఖ్య నేతలు గూడూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. గ్రామంలోని వైఎస్ఆర్సిపికి చెందిన ముఖ్య నేతలతో పాటుగా పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ కొణతం మస్తాన్, మరో నలుగురు వార్డు మెంబర్లు మరియు ఇతర నేతలు తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. గూడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ పార్టీలో చేరినటువంటి అందరికీ సముచిత స్థానం కల్పిస్తానని అయ్యవారిపాలెం గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని రాబోయే సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి పంచాయతీ నుంచి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామం నందు ఇంటింటి ప్రచారం చేపట్టి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు అందే సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అయ్యవారిపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు మేకనూరు మాజీ సర్పంచ్ అమరేంద్ర, గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వర్లు రాజు, తిరుపతి పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బిల్లు చెంచురామయ్య, తిరుపతి జిల్లా తెలుగు మహిళా నాయకురాలు మట్టం శ్రావణి, నాయకులు దువ్వూరు రవీంద్రారెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు వేతనం పెంచాలి జే తులసి రాజన్






**గూడూరు రూరల్, మార్చి 03(శ్రీచక్ర) :**

గూడూరు నియోజకవర్గం, ఏ.పీ, వ్యవసాయక కార్మిక సంఘం, గూడూరు నియోజకవర్గ, ప్రథమ మహాసభ, ఎగవ, రాజుపాలెంలో జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి, తిరుపతి జిల్లా అధ్యక్షులు, జె. తులసి రాజన్, ప్రధాన కార్యదర్శి సి. హెచ్ .ప్రభాకర్ పాల్గొన్నారు, ఈ రాష్ట్రంలో ఉపాధి కూలీ పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజువారి కూలీ 600 ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది, అదేవిధంగా గ్రామీణ ప్రాంతంలో హిందుస్థాన్ గురించి కనీసం ఐదు సెంట్లు ఇవ్వాలని ఐదు లక్షల రూపాయలు నిర్మాణానికి ఇవ్వాలని కోరడం జరిగింది, పెరిగిన నిత్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని , గ్రామీణ కష్టజీవులను ఆదుకోవాలని వలస కూలీలను ఆపాలని, ఈ సందర్భంగా కోరడం జరిగింది, రాబోయే కాలంలో దళిత గిరిజనుల మైనార్టీ బిసి వర్గాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంత అభివృద్ధి కొరకు పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించడం జరిగింది, మహాసభ అనంతరం నూతన కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

# ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం

**మియాపూర్, మార్చి 3 (శ్రీచక్ర):**



సోసియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ఛైర్మెన్ డాక్టర్. కొప్పుల విజయ్ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు రంగారెడ్డి రెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, న్యూ హాఫీజ్ పేటలో ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి హైదరాబాద్ ప్రెసిడెంట్ ఎండి. బసీరుద్దీన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఛైర్మెన్ ఎండి. నాసీర్ ఉద్దీన్, ఎండి గౌస్ ఉద్దీన్ సిబ్బంది అందరూ కలిసి ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ ఇమ్యూనైజేషన్ డే'ను పురస్కరించుకుని ఆదివారం దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం జరిగిందన్నారు. ఇందులో భాగంగా తమ హ్యూమన్ రైట్స్ జాతీయ ఛైర్మెన్ డా. కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు మియాపూర్ పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ తో పాటు తాము కూడా ముందుండి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. హెల్త్ సెంటర్లు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, లైబ్రరీలతో సహా పర్యాటక ప్రాంతాలు, బస్టాండ్లు, విమానాశ్రయంలలో ప్రత్యేక కేంద్రాలలో పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చుక్కలు వేయడం జరిగిందన్నారు. మార్చి 3న పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన పిల్లల వివరాల్ని తీసుకుని.. 4, 5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేయనున్నారని వారు తెలిపారు. ఒక్క నిమిషంలో పల్స్ పోలియో చుక్కలు వేసేస్తారు. కాబట్టి అధికారుల కోసం ఎదురుచూడకుండా.. మీ పిల్లల కోసం ఒక్క నిమిషం కేటాయిస్తే సరిపోతుంది. పిల్లలకు పోలియో చుక్కలు వేశాక.. రెండు రోజులపాటూ కొంత ఇబ్బంది పడతారు. అది చూసి తల్లిదండ్రులు టెన్షన్ పడవద్దని హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో పోలియో చుక్కల కార్యక్రమం చాలా విజయవంతంగా జరిగిందని సోసియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రతినిధులు తెలిపారు..

# ఫ్లైట్ లో భార్య కాళ్లు నొక్కిన రామ్ చరణ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మరోసారి మహిళల హృదయాలను గెలుచుకున్నారు. ఇటీవల విమానంలో వెళు తూ రామ్ చరణ్ చేసిన పనికి ప్రశంసలు కురిపిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ వీడియో చూసిన మహిళా అభిమానులు.. చెర్రీ ఆదర్శ భర్త అని, బెస్ట్ హజ్బెండ్ అవార్డు ఇచ్చేయాలని కామెంట్లు పెడుతున్నారు. ఇంతకీ ఈ వీడియోలో ఏముందంటే.. అపర కుబేరుడు ముఖేశ్ అంబానీ ఇంట పెళ్లి వేడుకలు జరుగుతున్న విషయం తెలిసిందే. అంబానీ కొడుకు అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ ల ప్రి వెడ్డింగ్ గ్రాండ్ గా జరుగుతోంది. ఈ వేడుకకు ఆహ్వానం అందడంతో రామ్ చరణ్, ఉపాసన దంపతులు శుక్రవారం జామ్ నగర్ బయలుదేరి వెళ్లారు. ప్రైవేట్ జెట్ లో ప్రయాణిస్తూ ఉపాసన కునుకు తీయగా.. రామ్ చరణ్ ఆమె పాదాలకు మసాజ్ చేశాడు. దీనిని రామ్ చరణ్ అసిస్టెంట్ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో ఈ వీడియో కాస్తా వైరల్ గా మారింది. వీడియో చూసిన మహిళలు రామ్ చరణ్ ను తెగ మెచ్చుకుంటున్నారు. కాగా, రామ్ చరణ్ ఇంట్లోను, బయట కూడా భార్యకు ఎంతో సాయంగా వుంటారు. ఇంటి పనుల్లో ఓ చేయి వేయడం, బయట షాపింగ్ కు వెళితే బ్యాగులు తను తీసుకురావడం.. ఇలా అన్నింట్లోనూ భార్య ఉపాసనకు చెర్రీ చేదోడువాదోడుగా ఉంటారు.



## 3.450 మందికి పల్స్ పోలో చుక్కలు... వైద్య అధికారి



**బాలాయపల్లి, మార్చి 03(శ్రీచక్ర) :**

3450 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయడం జరిగిందని స్థానిక వైద్యా ధికారిని ప్రమీల పేర్కొన్నారు. ఆదివారం పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ మండల ములో 54 పల్స్ పోలియో కేంద్రాలు, మండల కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండు,వెండోడు రైల్వే స్టేషన్, రెండు మొబైల్ కేంద్రాలలో 3500 మంది చిన్నారులకు గాను 3450 మంది చిన్నారులకు పల్స్ పోలే చుక్కలు వేయడం జరిగిందన్నారు. మిగతా వారికి సోమ, మంగళవారం ప్రతి ఇంటిని సందర్శించి పల్స్ పోలియో చుక్కలు వేసుకుని వారిని గుర్తించి వారికి పలసపోయే చుక్కలు వేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్ర మంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పొలం కంచి తగలబెట్టారని పోలీసులకు ఫిర్యాదు



**బాలాయపల్లి, మార్చి 03(శ్రీచక్ర) :**

దౌర్జన్యంగా వ్యవసాయ పొలానికి సంబంధించిన కట్టవ తగలబెట్టిన సంఘటన మండలములోని కడగుంట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితులు కథనం మేరకు సర్వే నెంబరు 174/69 ఏలో 2 ఎకరాల10 సెంట్లు, 174/70ఏలో 2 ఎక రాలు, 174/70బి లో 2 ఎకరాల భూమికి సంబం ధించి కట్టవను అదే గ్రామానికి చెందిన వప్పుతోట్టి. సునీల్,వప్పుతోట్టి.శ్రీనివాసులు,పామల.తిరుపాలు,వీరేపల్లి. సుధాకర్,వీరేపల్లి. వెంకటకృష్ణ య్య,వప్పుతోట్టి. వెంకటయ్య, పామల. శ్రీనువాసులు,మోచర్ల.పోలయ్య,వప్పుతోట్టి.వెంకటయ్యలు, దౌర్జన్యంగా వ్యవసాయ పొలం కు వేసి ఉన్న ముళ్ళకంప కట్టవను తగలబెట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ఎస్సై మహబూబ్ సుభాని దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

## అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్

- అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు
- 2ఫుల్, 10 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం




**గూడూరు రూరల్, మార్చి 03(శ్రీచక్ర) :**

అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ "హెచ్చరించారు.గూడూరు రూరల్ పరిధిలోని రెడ్డిగుంట సంగం గ్రామంలో ఆదివారం 2ఫుల్, 10 క్వార్టర్ బాటిల్స్ ను అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ వారి సిబ్బందితో కలిసి మెరుపు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తి వద్ద నుండి 2ఫుల్, 10 క్వార్టర్ బాటిల్స్ నుస్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై మనోజ్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం అమ్మటం చట్టరీత్యా నేరమని అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందిస్తే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదేవిధంగా ఎక్కడా బెల్టు షాపులు నిర్వహించరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, వాహనదారులు తప్పనిసరిగా వాహనపత్రాలను కలిగి ఉండాలని సూచించారు.మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మనోజ్ కుమార్ హెచ్చరించారు.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**